సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 5 । మే । 2024



మోదీ వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ

మోదీ ప్రభుత్వం మళ్లీ వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. - IIలో



చేనేత కళానైపుణ్యం భేష్

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. భూదానోద్యమ ఫొటో గ్యాలరీని పరిశీలించారు. - IIIలో

గరిష్టం / కనిష్టం
43° / 26°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నృసింహుడికి లక్ష పుష్పార్చన



శ్రీస్వామి, అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. ఈ వేడుకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. ఆలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం సాయంత్రం వెండి జోడు సేవ నిర్వహించారు.

సబ్ జైల్, బాలసదన్‌లో వసతుల పరిశీలన



బాలసదన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి

భువనగిరి క్రైం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత శనివారం భువనగిరి సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి జైలు అధికారికి సూచనలు చేశారు. అలాగే ఖైదీలకు అందుతున్న న్యాయ సహాయంపై ఆరా తీశారు. అనంతరం బాలసదన్‌ను సందర్శించి బాలికల బాగోగులపై తెలుసుకున్నారు. వసతుల లేమిని గుర్తించి సమస్య పరిష్కరించాలని బాలసదన్ ఇన్‌చార్జిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ బండారు జయశ్రీ, డీసీపీఓ సైదులు, బాలసదన్ ఇన్‌చార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

సూర్యాపేట: జూన్ 2, 3 తేదీల్లో సూర్యాపేటలో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్ర అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు వివక్ష, అణచివేత, దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను చైతన్యం చేసేందుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ తరగతుల నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారసాని చంద్రకళ, కొత్తపల్లి రేణుక, జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, ఐతరాజు పద్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలు తెలంగాణ, కర్ణాటక



సింగిల్స్ ఆడుతున్న అతర్వ శ్రీరామోజు

భువనగిరిలో జరుగుతున్న జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. బాలుర విభాగంలో తెలంగాణకు చెందిన అతర్వ శ్రీరామోజు, బాలికల విభాగంలో కర్ణాటకకు చెందిన సృష్టి కిరణ్ గెలుపొందారు.

సమస్యల సంగతేంటి?

- కొత్త వాగ్దానాలు లేవు.. గత హామీల ప్రగతి చెప్పడం లేదు
- ప్రచారంలో వ్యక్తిగత విమర్శలకే అధిక ప్రాధాన్యం
- అభివృద్ధిపై నోరు మెదపని పార్టీలు
- అభ్యర్థుల తీరుపై పెదవి విరుస్తున్న ఓటర్లు



సాక్షి యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ప్రధాన రాజకీయ పార్టీలు హోరెత్తిస్తున్నాయి. అయితే ప్రచారానికి వస్తున్న నేతలు స్థానిక అభివృద్ధిపై హామీలు ఇస్తారని జనం ఆశిస్తున్నా.. ఆ ప్రస్తావనే ఉండడం లేదు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన హామీల ప్రగతి, కొత్త వాగ్దానాల ఊసే ఎత్తడం లేదు. ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు, అభివృద్ధికి స్థానికంగా ఉపయోగపడే వనరులు ఏమిటి? అన్న విషయాలను కనీసం ప్రస్తావించడం లేదు. కేవలం విమర్శలకే ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మూసీ ప్రక్షాళన, రాయగిరి వరకు ఎంఎంటీఎస్, ఎయిమ్స్‌లో మెరుగైన సౌకర్యాలు, టూరిజం సర్క్యూట్, హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై అండర్ పాస్‌ల నిర్మాణం.. ఇలా మరెన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఐటీ కారిడార్‌ను మరిచారు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఐటీ కోర్సులు చదివిన విద్యార్థులు వేలాది మంది ఉన్నారు. వీరిలో చాలా మంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో హైదరాబాద్ – విజయవాడ, హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారుల వెంట ఐటీ కారిడార్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సమస్యను ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ ప్రస్తావించడం లేదు. కనీసం నియోజకవర్గ స్థాయిలో తాము ఇది చేస్తామని మెనిఫెస్టో ప్రకటించడం లేదన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

పర్యాటక రంగాన్ని పట్టించుకోవడం లేదు

రాచకొండ, కొలనుపాక, కొమురవెల్లి, పెంబర్తి, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి ఖిలా, యాదగిరిగుట్ట ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయి. ఏళ్లు గడిచిపోయాయే తప్ప.. అభివృద్ధి అడుగు కూడా పడలేదు.

అటకెక్కిన పరిశ్రమలు

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం పరిధిలో రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ సిటీ హామీలు కార్యరూపం దాల్చలేదు. ఆలేరు నియోజకవర్గం దాతర్‌పల్లిలో ప్లాస్టిక్ రహిత పరిశ్రమలు నిలిచిపోయాయి. నకిరేకల్ నియోజకవర్గం చిట్యాలలో డ్రైపోర్టు, తుంగతుర్తి నియోజకవర్గంలో ఆహార శుద్ధి పరిశ్రమ ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి.

సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్

తుంగతుర్తి నియోజకవర్గంలో రుద్రమ్మ రిజర్వాయర్ ఊసే లేకుండాపోయింది. ఇక మునుగోడు నియోజకవర్గంలో శివన్నగూడెం, బస్వాపురం, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులతో పాటు బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువలు దీర్ఘకాలికంగా పూర్తికావడంలేదు. ఆలేరు నియోజకవర్గంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.జనగామ జిల్లా కేంద్రం అభివృద్ధి కోసం అనేక ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఏ ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు.

సుదీర్ఘకాలంగా రైల్వే సమస్యలు

- రైల్వే సమస్యలు సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రయాణికుల రద్దీ, ప్రజల అవసరాలకు అనుగుణంగా రైల్వే లైన్లు, నూతన రైళ్లు వేయడం లేదు. వసతులు మెరుగుపడడం లేదు.
- యాదాద్రి వరకు మంజూరైన ఎంఎంటీఎస్ రెండో దశ పనులు పూర్తి కాలేదు. దీంతో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టం (ఎంటీఎస్) రైలు వస్తుందని భావించిన వారికి నిరీక్షించక తప్పని పరిస్థితి ఉంది.
- రాయగిరి నుంచి ఎంఎంటీఎస్‌ను జనగామ వరకు పొడిగించాలన్న డిమాండ్ ఉంది.
- సికింద్రాబాద్ – కాజీపేట మార్గంలో మూడో లైన్ ఊసే లేకుండా పోయింది. ఈ ప్రాజెక్టు కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.
- బీబీనగర్– నడికుడి (252 కిలో మీటర్లు) డబ్లింగ్ పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు.
- పగిడిపల్లి నుంచి నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా నడికుడి జంక్షన్ వరకు రైలు మార్గాన్ని డబ్లింగ్ చేయాలన్న డిమాండ్ ఉంది.
- హైదరాబాద్ – విజయవాడ జాతీయరహదారి 65కు అనుబంధంగా హైదరాబాద్, వనస్థలిపురం, చౌటుప్పల్, నకిరేకల్, సూర్యాపేట మీదుగా అమరావతి వరకు బుల్లెట్ రైల్వేలైన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ, ఆ ప్రాజెక్టుకోసం కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
- సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేకు అనుబంధంగా బీబీనగర్, పగిడపల్లి, బొమ్మాయిపల్లి, నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ల వరకు రైల్వే లైన్లను విస్తరించి జంక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. బీబీనగర్ పారిశ్రామిక వాడ రైల్వే జంక్షన్‌గా రూపాంతరం చెందితే ఈ ప్రాంతంలోని వేలాది మంది నిరుద్యోగులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పొందే అవకాశాలు ఉంటాయి.

వామ్మో ఎండ



యాదాద్రి కొండపై టెంట్ కింద సేద దీరుతున్న భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రీశుడి సన్నిధికి వస్తున్న భక్తులు ఎండతీవ్రతకు బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు భానుడి భగభగలు, మరోవైపు కృష్ణశిల వేడితో విలవిలలాడుతున్నారు. ఉదయం 10.30 తరువాత భక్తుల రద్దీ తగ్గుముఖం పడుతుంది. శనివారం యాదగిరిగుట్టలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండను తట్టుకోలేక భక్తులు టెంటు కిందికి చేరడంతో ఆలయ తిరు, మాడ వీధులు బోసిపోయి కనిపించాయి.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- విడతల వారీగా వసతులు మెరుగుపరుస్తున్నాం
- యాదాద్రి ఈఓ భాస్కర్‌రావు



భక్తులకు స్వయంగా ప్రసాదం టికెట్‌లు అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు మెరుగుపరుస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాదం కొనుగోలులో భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను గ్రహించి శివాలయం ఎదుట ప్రత్యేకంగా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా శని, ఆదివారాలతో పాటు ఇతర సెలవు రోజుల్లో కొండపైన బస్టాండ్‌లో తాత్కాలిక అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు సమాచారం ఇవ్వడానికి హెల్ప్‌డెస్క్, వేసవి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. నిత్య కైంకర్యాలు, స్వామివారి సంకీర్తనలు భక్తులకు వినిపించేలా ప్రత్యేక దివ్యవాణి ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో మైకులు, స్పీకర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే క్యూకాంప్లెక్స్‌లో వాల్‌మోటింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులను ఆహ్లాదం పంచేందుకు ప్రతి శుక్ర, శనివారాల్లో సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు సంగీత, సాహిత్య, నృత్య సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

8 లక్షల మందికి ఉచిత ప్రయాణ సౌకర్యం

ఒక్క ఏప్రిల్ మాసంలోనే 369 బస్సులను కొండపైకి, కొండ కిందకు 9,825 ట్రిప్పులు నడిపించామని ఈఓ తెలిపారు. 8లక్షల మంది భక్తులు ఉచితంగా రవాణా సౌకర్యం పొందారని, ఇందులో 70 శాతం మహిళలు, 30శాతం మంది పురుషులు ఉన్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు

- 25 శాతం అదనంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం వీవీ ప్యాట్లు



ఈవీఎంల ర్యాండమైజేషన్‌లో కలెక్టర్, ఎన్నికల పరిశీలకుడు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

సాక్షి, యాదాద్రి : రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి 2,141 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను కేటాయించారు. ఇందులో 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా వీవీ ప్యాట్లు ఉన్నాయి. మొత్తం 8,023 బ్యాలెట్ యూనిట్లు, 2,673 కంట్రోల్ యూనిట్లు, 2,994 వీవీ ప్యాట్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టరు బెన్ షాలోమ్, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, జనగామ, ఇబ్రహీంపట్నం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఆర్డీఓ అమరేందర్, డి.సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, బి.ఎస్. లత, డి.కొమరయ్య, కె.అనంతరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, ఈడీఎం సాయి కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా..	పోలింగ్ కేంద్రాలు	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్లు
ఇబ్రహీంపట్నం	343	1287	428	480
మునుగోడు	317	1,188	396	443
భువనగిరి	257	963	321	359
నకిరేకల్	311	1164	388	435
తుంగతుర్తి	326	1221	407	456
ఆలేరు	309	1158	386	432
జనగాం	278	1042	347	389

సెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్ రూంలు ఇక్కడే..

ఇబ్రహీంపట్నం : ఖానాపూర్‌లోని గురునానక్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ టెక్నికల్ క్యాంపస్‌లో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయనున్నారు.
మునుగోడు : చండూరు మండల కేంద్రంలోని డాన్ బాస్కో జూనియర్ కాలేజీ
భువనగిరి : అరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ కాలేజీ
నకిరేకల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ
తుంగతుర్తి : వ్యవసాయ మార్కెట్ గోదాము
ఆలేరు : ఇండోర్ స్టేడియం
జనగాం : సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఈవీఎంలను భద్రపరచనున్నారు.

సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, యాదాద్రి : పోలింగ్ ప్రక్రియలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని, అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనమంతు కే.జెండగే సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల సెక్టార్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వీల్ చైర్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లుగా గుంపులుగా రాకుండా చూడాలని, ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమన్వయంతో సమస్యలు ఎదురుకాకుండా పోలింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందురోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఉదయమే చేరుకుని తమ రూట్లకు సంబంధించిన ప్రైసెడింగ్ ఆఫీసర్లతో కలిసి ఎన్నికల సామగ్రి తీసుకొని మధ్యాహ్నం లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయమే 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించాలని, పోలింగ్ ఏజెంట్లు సకాలంలో హాజరయ్యేలా వారికి ముందస్తుగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన వాహనాలకు జీపీఎస్ అమర్చనున్నట్లు వెల్లడించారు. ఈవీఎంలకు సంబంధించిన ఇంజనీర్లు, తహసీల్దార్లు, పోలీసు ఎస్‌హెచ్ఓల ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈవీఎం యంత్రాలను అమర్చడంపై మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

'నీట్'కు అంతా సిద్ధం

రామగిరి(నల్లగొండ) : నీట్ – 2024 నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం నల్లగొండలోని ఏడు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షకు 2316 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5.20 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటో, ఐడీ కార్డు తీసుకుని పరీక్షకు హాజరుకావాలని నీట్ జిల్లా కో ఆర్డినేటర్ జి.పార్థసారధి సూచించారు.

9న కూరెళ్లకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం




డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : కవి, ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం వ్యవస్థాపకులు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ఈనెల 9న ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ నుంచి కూరెళ్లకు ఆహ్వానం అందింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకోనున్నారు. సాహిత్య, సాంస్కృతిక రంగంలో కూరెళ్ల విఠలాచార్య చేస్తున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది.

రూ.1.42 కోట్లు వసూలు

- భువనగిరి మున్సిపాలిటీలో 'ఎర్లీబర్డ్'కు స్పందన
- గత ఏడాదితో పోలిస్తే రూ.12 లక్షలు అధికంగా వసూలు



భువనగిరి టౌన్ : ఎర్లీబర్డ్ స్కీంకు భువనగిరి మున్సిపాలిటీలో విశేష స్పందన లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ముందస్తు ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలంటూ మున్సిపల్ శాఖ ఏప్రిల్ 1వ తేదీన ప్రకటించిన ఆఫర్ గడువు 30న ముగిసింది. పన్ను బకాయిలు లేని వారికి ఈ అవకాశం కల్పించింది. వారితో పాటు 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను మొత్తం చెల్లించిన వారికి సైతం వర్తమాన సంవత్సరపు ఆస్తిపన్నులో ఐదు శాతం రాయితీ ఇచ్చారు. కాగా భువనగిరి మున్సిపాలిటీల్లో 9,482 అసెస్‌మెంట్ల ద్వారా రూ.4.79 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఎర్లీబర్డ్ పథకానికి స్పందించిన 1,833 ఆస్తుల యజమానులు.. రూ.1.42 కోట్ల మేర పన్ను చెల్లించారు. తద్వారా చెల్లింపుదారులకు రూ.7.51 లక్షల మేర రాయితీ లభించింది.

గత సంవత్సరం ఇలా..

2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ మున్సిపల్ శాఖ ఎర్లీబర్డ్ పథకం ప్రకటించింది. భువనగిరి మున్సిపాలిటీలో రూ.1.30 కోట్లు వసూలయ్యాయి. ఈ సంవత్సరం రూ.1.42 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ.12 లక్షలు ఎక్కువగా వసూలైంది. ఆస్తిపన్ను వసూలుకు అధికారులు విస్తృత ప్రచారం చేయడం ఫలితమిచ్చింది.

మిగిలింది.. వారం రోజులే!

- లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సమీపిస్తున్న గడువు
- వేగం పెంచిన పార్టీలు.. జోరుగా ప్రచారం
- రాష్ట్ర, జాతీయ నేతల పర్యటనలు
- మండుటెండలతో ఉదయం, సాయంత్రం వేళల్లోనే సభలు, సమావేశాలు
- కాంగ్రెస్ పార్టీ భారం ఉత్తమ్, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై..
- బీఆర్ఎస్ గెలుపు బాధ్యత జగదీష్‌రెడ్డికే..



చౌటుప్పల్‌లో జరిగిన బీజేపీ యువ సమ్మేళనంలో బూర నర్సయ్యగౌడ్, మురళీధర్‌రావు తదితరులు



భువనగిరిలో జరిగిన సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల ప్రచార గడువు దగ్గర పడుతోంది. జనంలోకి వెళ్లేందుకు అభ్యర్థులకు వారం రోజులే మిగిలి ఉంది. దీంతో పార్టీలన్నీ ప్రచారంలో వేగం పెంచాయి. పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం ముగియనున్నందున ఈ లోపు ఎక్కడెక్కడ అయితే ముఖ్యమైన సమావేశాలు నిర్వహించాలనే దానిపై ఆయా పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ప్రచారాల్లో ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటున్నారు. లోక్‌సభ నియోజకవర్గాలు, జిల్లాను బాధ్యతగా తీసుకొని మంత్రులు ఎన్నికల పోరులోకి దిగారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి నల్లగొండలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. భువనగిరిలో గెలుపు బాధ్యతను కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీసుకోగా, అక్కడా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారం అందిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రం రెండు చోట్లా అభ్యర్థుల గెలుపు బాధ్యతను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపైనే పెట్టింది. దీంతో ఆయన అన్నీ తానై ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర నేతలు తీసుకున్నారు.

ప్రచార రథాలు.. సభలు, సమావేశాలు

ప్రధాన పార్టీలు ఎక్కువగా ప్రచార రథాలు, సోషల్ మీడియాపై దృష్టి పెట్టాయి. ఇన్‌చార్జిలు, రాష్ట్ర స్థాయి నేతల పర్యటనలతోపాటు ఆయా ప్రాంతాల్లో ప్రచార రథాలను (మైక్‌తో కూడిన వాహనాలను) తిప్పుతున్నాయి. ఏ వీధికెళ్లినా ఆయా పార్టీల ప్రచార రథాలు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తూ రికార్డు చేసిన వాయిస్‌తో కూడిన నినాదాలు ప్లే చేస్తూ తిప్పుతున్నారు. ముఖ్య నేతల పర్యటనలతో రోడ్‌షోలు, సభలు నిర్వహిస్తూ పార్టీలన్నీ ఓటర్లకు గాలం వేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ, భువనగిరి ఇన్‌చార్జిలు తమ అభ్యర్థులైన కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం రోజువారీ షెడ్యూల్ రూపొందించుకొని మరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక రెండు నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్ గెలుపు కోసం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నిత్యం ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులు శానంపూడి సైదిరెడ్డి, బూర నర్సయ్యగౌడ్ నిత్యం ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో రెండుసార్లు పర్యటించగా, కేటీఆర్ రెండుసార్లు, హరీష్‌రావు రెండు నియోజకవర్గాల సమావేశాల్లో పాల్గొన్నారు. బీజేపీ కేంద్ర మంత్రి కిరణ్ రిజీజు, రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఇతర నేతలు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ నెల 6న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటించబోతున్నారు.

ఎండ మంట పుట్టిస్తున్నా..

ఎండలు మంట పుట్టిస్తున్నా.. పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు నమోదవుతున్నా.. నేతలు ప్రచారంలో ఏమాత్రం తగ్గడం లేదు. ఎన్నికలకు మరో వారం రోజులే గడువు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాత్రి 10 గంటల వరకు ప్రచారానికి సమయం ఉండటంతో ఆ సమయం వరకు రోడ్‌షోలు, సభలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నియోజకవర్గ స్థాయిల్లో బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించింది. రోడ్‌షోలు కూడా నిర్వహిస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా ఇంటింటి ప్రచారంతో పాటు రోడ్ షోలను నిర్వహిస్తున్నాయి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

హామీలు అమలు చేయాలని సీఎంకు పోస్ట్‌కార్డులు

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ మాడుగులపల్లి మండలంలోని సీత్యా తండా రైతులు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులు పంపారు. 'ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు కావొస్తున్నా వరికి రూ.500 బోనస్ ఇవ్వలేదు. సాగుకు నిరంతర విద్యుత్, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం సక్రమంగా అందలేదు. హామీలను అమలు చేస్తారన్న నమ్మకంతో ఓటేశాం.. మా నమ్మకాన్ని వమ్ము చేయొద్దు' అంటూ ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్‌కార్డుల్లో రైతులు పేర్కొన్నారు.
– మాడుగులపల్లి


పోస్ట్‌కార్డులు చూపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నేతలు

రెండో విడత ర్యాండమైజేషన్

రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేవని పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఆయన వివరించారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఏఆర్‌ఓలు, అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.
– నల్లగొండ

24గంటలూ పోలీసు నిఘా

● సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 24గంటలూ పోలీసు నిఘా పెట్టామని ఎస్పీ రాహుల్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి డబ్బు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర సరిహద్దు వద్ద గస్తీ కాస్తున్నట్లు తెలిపారు. పారామిలటరీ సిబ్బంది, ఇతర శాఖల అధికారుల సహాయంతో జిల్లా అంతటా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు.

రూ.2.70కోట్ల నగదు స్వాధీనం..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.2.70 కోట్ల నగదు, రూ.17లక్షల విలువైన మద్యం, రూ.30వేల విలువైన గంజాయి, రూ.1.14కోట్ల విలువ గల ఆభరణాలు, రూ.1.04 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు సీజ్ చేశామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.74కోట్ల విలువైన మద్యం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విధులు పకడ్బందీగా నిర్వహించాలి


దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో సమావేశమైన ఎన్నికల వ్యయ పరిశీలకులు

దేవరకొండ: ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ అన్నారు. శనివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ వ్యయ పరిశీలకుడు, అకౌంటింగ్, వీవీ టీంల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేవరకొండ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఆయా టీంల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎర్రగుంటపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీరాములు, అసిస్టెంట్ వ్యయ పరిశీలకుడు హరిదీప్‌రెడ్డి తదితరులున్నారు.

మోదీ మళ్లీ వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ

● సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: దేశంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ భువనగిరి మండల కౌన్సిల్ సభ్యులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు రుణమాఫీ చేయకుండా, కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రూ.14 లక్షల కోట్లను మాఫీ చేశారని ఆరోపించారు. దేశంలో ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నం జరుగుతుందన్నారు. భువనగిరి ప్రాంతానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కాంగ్రెస్‌తో జతకట్టి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడామని, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉండి మతతత్వపు పాలనకు చరమగీతం పాడుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా బయటకు వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చినందుకు సంతోషంగా ఉందన్నారు. సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీజేపీని గద్దె దింపాలి..

దేశంలో బీజేపీని గద్దె దింపడం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుస్తుందని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో బీజేపీకి మెజార్టీ సీట్లు రావన్నారు.

కమ్యూనిస్టులు గెలుపోటములను ప్రభావితం చేయగలరు..

ఇప్పుడున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు గెలుపోటములను ప్రభావితం చేయగలరని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సీపీఐ సహకారంతో తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి..

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఇండియా కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ సహకారం ఉండాలన్నారు. మరోసారి మోదీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తారన్నారు. భువనగిరి నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించి లోక్‌సభకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, ఆయా జిల్లాల కార్యదర్శి శ్రీరాములు, నెల్లికంటి సత్యం, రాజారెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, శ్రవణ్‌కుమార్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే. శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఏశాల అశోక్, కళ్లెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ శ్రీనివాసన్


మాట్లాడుతున్న రామ శ్రీనివాసన్

నాగారం: బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ శ్రీనివాసన్ పిలుపునిచ్చారు. శనివారం నాగారం మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ బలపడటమే కాకుండా ప్రపంచ దేశాల్లో భారతదేశం ముఖచిత్రం మారిందన్నారు. మోదీ చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. 70ఏళ్ల స్వతంత్ర భారతంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీలేదని, లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందన్నారు. సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కర్ణాటక రాష్ట్రానికి చెందిన దేవయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, బీజేపీ జిల్లా కన్వీనర్ కాప రవి, కో–కన్వీనర్ కూరాకుల వెంకన్న, మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, కుంభం కరుణాకర్, దేశగాని నర్సయ్య, సోమేష్‌గౌడ్, గిరిప్రసాద్, రాములు, సాయిలు పాల్గొన్నారు.

పోలింగ్ సమయం పెంపుపై అవగాహన కల్పించాలి

● ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ


మాట్లాడుతున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, పక్కన కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయం గంట పెంచిన విషయంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా కీలకమని, ప్రతి అంశాన్ని పరిశీలించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 గుర్తింపు కార్డులపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏమైనా సందేహాలు వస్తే 7337046757 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, లోక్‌సభ ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ శ్రవణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, మాస్టర్ ట్రైనర్ డి. బాలు పాల్గొన్నారు.

భువనగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

● ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషిచేయాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి పట్టణంలో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫియొద్దీన్ ఫారీ, నాయకులు మహ్మద్ నజీర్, సలావుద్దీన్, అతీక్, మజహార్, అబేద్‌అలీ, అమానతుల్లా, అవైస్‌చిస్తీ, లయిఖ్‌అహ్మద్, సిరాజ్, అతహార్ పాల్గొన్నారు. అదేవిధంగా భువనగిరి పట్టణంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం యువజన కాంగ్రెస్ శ్రేణులు కష్టపడి పనిచేయాలని సూచించారు.

పట్టభద్రుల స్థానానికి మూడో రోజు నలుగురు నామినేషన్లు

నల్లగొండ: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మూడోరోజు నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. నేషనల్ నవక్రాంతి పార్టీ తరఫున కర్నె రవి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా బైరబోతుల శ్రీనివాసరావు, దైద సోమసుందరం, బక్క జడ్సన్ నామినేషను పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్. మహేందర్‌కు అందజేశారు. కాగా మూడురోజుల్లో కలిపి మొత్తం 12మంది నామినేషన్లు వేశారు.


గరిడేపల్లి: ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో జానారెడ్డి


మఠంపల్లిలో ఎన్నిక ప్రచార సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

● ఓటు హక్కుపై అవగాహన


కోదాడ పట్టణంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు

● సిద్ధమవుతున్న పోలింగ్ కేంద్రాలు


నాగారం: తిమ్మాపురంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు


నాగారం: నాగారంబంగ్లాలోని పోలింగ్ కేంద్రంలో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న డీపీఓ సురేశ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చింతపల్లి: మండల పరిధిలోని మథనాపురం వద్ద హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రానికి చెందిన బత్తుల లక్ష్మారెడ్డి(75) శనివారం తన సొంతూరుకు వెళ్లేందుకు చింతపల్లి మండలం మథనాపురం వద్ద రోడ్డు పక్కన నిల్చొని ఉండగా మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తి..

చివ్వెంల(సూర్యాపేట): కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండవ బుచ్చయ్య (36) కల్లు గీసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మండవ బుచ్చయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మండవ జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

హుజూర్‌నగర్: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఎలుకల మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన మేకపోతుల వీరబాబు కుమారుడు మణికంఠ (17) స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెచ్‌ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల రాసిన పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై గత నెల 29న ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి ఖమ్మం ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి బాబాయి మేకపోతుల సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

మునగాల(కోదాడ): మండలంలోని వెంకట్రాంపురం గ్రామశివారులో శనివారం మహిళ మృతదేహం లభ్యమైంది. మునగాల పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గరిడేపల్లి మండలం చినగారకుంట తండాకు చెందిన మతిస్థిమితం లేని భుక్యా భాజీ(45) కొంతకాలంగా చుట్టు పక్కల గ్రామాల్లో భిక్షాటన చేసుకుంటూ తిరుగుతుంటుంది. తాడువాయి గ్రామానికి చెందిన దాచేపల్లి జానయ్య వ్యవసాయ భూమిలో శనివారం ఆమె మృతిచెంది ఉంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఆమెను గరిడేపల్లి మండలం చినగారకుంట తండాకు చెందిన మహిళగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

భువనగిరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి క్రైం: భువనగిరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ పరిధిలోని సంజీవ్‌నగర్ సమీపంలో సుమారు 60 సంవత్సరాల గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానికుల సాయంతో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఉపాధి పనులకు వెళ్లిన వ్యక్తి వడదెబ్బతో మృతి


వెంకన్న(ఫైల్)

నూతనకల్: మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో శనివారం ఓ వ్యక్తి ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన కట్ట వెంకన్న(48) ఉపాధి హామీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. అనంతరం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా వడదెబ్బకు గురై మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సూర్యాపేటలో..

సూర్యాపేట: సూర్యాపేటలో వడదెబ్బతో వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పర్వేజ్ (30) జిల్లా కేంద్రంలో బోరుబండి మీద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొత్త బస్టాండ్ సమీపంలో ఎండకు తాళలేక మృతి చెందాడు. మృతుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మండల రిసోర్స్ కేంద్రంలో చోరీ

కేతేపల్లి: కేతేపల్లిలోని మండల రిసోర్స్ కేంద్రం(ఎంఆర్‌సీ)లో కంప్యూటర్ సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. ఎంఈఓ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఎంఆర్‌సీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో గత పది రోజులుగా సిబ్బంది కార్యాలయాన్ని తెరవడం లేదు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయ కంప్యూటర్ గది తాళం పగులగొట్టి అందులో ఉన్న ఆరు ఇన్వర్టర్ బ్యాటరీలు, మూడు కంప్యూటర్ మానిటర్లు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం సిబ్బంది కార్యాలయం వద్దకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఎంఈఓ నాగయ్య కార్యాలయాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతం

● మహిళ మృతి ● కాపాడబోయిన మరో మహిళ పరిస్థితి విషమం

మిర్యాలగూడ అర్బన్: దుస్తులు ఆరేస్తుండగా తీగకు విద్యుత్ సరఫరా కావడంతో మహిళ మృతిచెందింది. ఆమెను కాపాడబోయిన మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందర్‌నగర్‌కు చెందిన గుంజ ఎంకమ్మ(45) దుస్తులు ఉతికి వాటిని ఆరేసేందుకు ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన తీగపై వేసింది. అప్పటికే ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఎంకమ్మకు షాక్ తగలి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. పక్కనే ఉన్న ఆలకుంట్ల రమాదేవి ఆమెను గమనించి లేపడానికి ప్రయత్నించగా ఆమెకు కూడా విద్యుత్ షాక్ తగిలి పడిపోయింది. స్థానికులు వారిద్దరిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఎంకమ్మ మృతి చెందగా.. రమాదేవి పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండకు తరలించారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలుండగా వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఆమె భర్త గుంజ చిన్న దుర్గారావు దివ్యాంగుడు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అనంతగిరి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అనంతగిరి మండల పరిధిలోని గోండ్రియాలలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు, ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గోండ్రియాల గ్రామానికి చెందిన జల్ల రామకృష్ణ(42) గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు. భార్య జల్ల ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

దేవరకొండ: మండల పరిధిలోని శేరిపల్లి గ్రామ సమీపంలో గల ఇటుక బట్టీల వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా వృద్ధుడు ఎండ వేడిమికి తాళలేక మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.